జరిగిన కథ:

ప్రస్తుత కథలో ఒక శుక్రవారం మధుర, అభిరామ్ వాళ్ళింటికి వెళ్ళి, ఆ రాత్రి అక్కడే ఉండిపోతుంది. అభిరామ్ తన జీవితంలో తండ్రితో తనకున్న అభిప్రాయభేదాల గురించి, తన ఇష్టాయిష్టాల గురించి, అమెరికాలో చదువుకుంటున్నప్పుడు తనకు ఎదురైన చేదు అనుభవాల గురించి మధురతో పంచుకుంటాడు. మధుర అతని అసలు సమస్య ఏమిటో అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది.

గత కాలపు కథలో అంబాపురం గ్రామంలో దుండగులు అమ్మవారి ఆలయంపై ఏకాదశి రోజు సాయంత్రం పథకం ప్రకారం దాడి చేస్తారు. సాదాసీదా, కంటికి కనిపించకుండా రెండు దిక్కులనుండి బాణాలను వేస్తూ దుండగులను హతమారుస్తుంది. భీమూతుడు హతమవ్వగా మిగిలిన దుండగులు పారిపోతారు. గుడి నుండి బయలుదేరే ముందు, పూజారి వద్ద తీర్థం అందుకోవడానికి సాదాసీదా తన చేతి చర్మపు తొడుగు తొలగిస్తుంది. ఆ సమయంలో అక్కడే ఉన్న గుణ ఆమె చేతికి తాను చేసిన ఉంగరాన్ని చూస్తాడు.

🦋🦋🦋

నమ్మకం

అభిరామ్ గురించి లోతుగా తెలుసుకుంటున్నకొద్దీ మధురకు అతనిపై అభిమానం, జాలి, ప్రేమ అన్నీ మరిన్ని రెట్లు పెరుగుతున్నాయి మధురకు. అతనేమీ మానసిక రోగి కాడు. కానీ జీవితం పట్ల సరైన అవగాహన లేదు అతనికి అనిపించింది. తాను అతనికి ఏ విధంగా ఉపయోగపడగలదా అని నిశితంగా ఆలోచిస్తోంది.

"మధురా! నా ఒపీనియన్స్ నీకు వింతగా అనిపించవచ్చు. నేను ఎవరినీ తప్పుగా అనుకోవటం లేదు. 'నా కర్మ ఇంతే ఈ జన్మకి' అనుకునే సమయంలో నువ్వు నా లైఫ్ లోకి రావడం నిజంగా నా అదృష్టమే. నిన్ను చూశాక జీవితంపై కాస్త పాజిటివిటీ కలిగింది. అందుకే చిన్నప్పటి నుండి ఎవరితోనూ పంచుకోలేని విషయాలన్నీ నీతో చెప్పుకుంటున్నాను." అన్నాడు అభిరామ్ దీనంగా.

"అభీ! నువ్వు అందరినీ ఒకే దృష్టితో చూస్తున్నావు. కనుక నీకు ఎవరిలోనూ మంచి కనిపించడంలేదు. నువ్వు ఏమీ అనుకోనంటే కాస్త చనువుగా నీ పర్సనల్ విషయం ఒకటి అడుగచ్చా?" అని అడిగింది కాస్త సంకోచిస్తూనే.

"నువ్వు నన్ను నిస్సంకోచంగా ఏదైనా అడగచ్చు. నేను ఏమీ అనుకోను." అన్నాడు అభిరామ్ తడుముకోకుండా.

"అయితే కాలేజీలోనో లేక ఎంబీఏ చదువుకున్నప్పుడైనా కనీసం నీకు ఎప్పుడూ ఏ అమ్మాయిపైనా కొంచెం కూడా మంచి ఒపీనియన్ లేక ప్రేమ కలగలేదా?" సంకోచిస్తూనే అడిగేసింది మధుర.

"నా బతుక్కి ప్రేమ ఒకటి! అమెరికాలో ఎంబీఏ చదువుతున్న రోజుల్లో ఒక నార్త్ ఇండియన్ అమ్మాయి పరిచయమైంది. సాటి ఇండియన్ కనుక ఆమెతో కాస్త దగ్గరయ్యాను. కానీ కొద్ది రోజుల్లోనే ఆమె ప్రేమిస్తున్నానంటూ విసిగించడం మొదలుపెట్టింది. నాకు తనపై ఆ అభిప్రాయం లేదని క్లియర్ గా చెప్పాను. ఒకరాత్రి నా రూమ్ కి వచ్చి కాస్త ఓవర్ క్లోజ్ అవ్వడానికి ప్రయత్నించింది. తాగి ఉందేమో కూడా తెలీదు. దానితో నా పేషెన్స్ పూర్తిగా పోయి తన మత్తు వదిలించడానికి ఒక చెంప దెబ్బ కొట్టాను. నన్ను నోటికి వచ్చిన తిట్లు తిట్టి వెళ్లిపోయింది. ఆ తర్వాత అసలు నేను మగాడినే కానని నాపై కాలేజిలో ప్రచారం చేసింది. ఆ తర్వాత అక్కడ మిగిలిన ఆరు నెలలు చదువు పూర్తి చేయడానికి నేను నరకం చూశాను. ఇంత జరిగాక నాకు అమ్మాయిలపై మంచి ఒపీనియన్ ఎలా వస్తుంది? ఇవన్నీ నాన్నతో ఎలా చెప్పగలను?" ఒకపక్క దుఃఖం, మరొక పక్క ఉక్రోషం కలగలిసిన స్వరంలో తన బాధ చెప్పుకున్నాడు అభిరామ్.

మధుర కళ్ళు తనకు తెలియకుండానే చెమ్మగిల్లాయి. అభిరామ్ భుజంపై చేయి వేసి "సారీ అభీ! అనవసరంగా నీకు పాస్ట్ అంతా గుర్తు తెచ్చి బాధ పెట్టాను." అంది నెమ్మదిగా.

"లేదు మధురా! నిజానికి నేను ఒంటరిగా నా బుర్రలో మోస్తున్న బరువును నువ్వు దించుతున్నావు. నీతో చెప్పుకుంటుంటే నా మనసు తేలిక అవుతోంది." అన్నాడు అభిరామ్ నిట్టూరుస్తూ.

"నిన్ను నువ్వు ఒక విక్టిమ్ గా అనుకోవడం పక్కన పెట్టి, ఒక థర్డ్ పర్సన్ గా వింటాను అంటే.. నువ్వు చెప్పినదంతా విన్నాక నాకు అనిపించిన అభిప్రాయం చెప్తాను." అంది మధుర నెమ్మదిగా.

వెంటనే చెప్పమన్నట్టు తలాడించాడు అభిరామ్ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"ఒకసారి నీ పర్స్పెక్టివ్ నుండి బయటకు వచ్చి చూడు అభీ! మనందరం పరిస్థితుల చేతిలో కట్టుబడి ఉన్నవాళ్ళమే. పరిస్థితులు మనం అనుకున్నట్లు మారవు. మనమే వాటికి తగినట్లు మారాలి. నీకు ఎదురైన అమ్మాయిలందరూ ఒకేలా ఉన్నారని, ప్రపంచంలోనే ఆడపిల్లలు అందరిపై సెల్ఫిష్ పీపుల్ గా స్టాంప్ వేయడం కరెక్ట్ కాదు. రోడ్డుపై నేను వెళుతూ ఉంటే ఎంతోమంది పోకిరి వెధవలు ఏడిపించాలని, లైన్ వేయాలని చూస్తూ ఉంటారు. నన్ను కూడా మగ జాతి మొత్తాన్ని పనికిమాలినవాళ్ల కింద లెక్క కట్టి కూర్చుని తిట్టుకోమంటావా? సినిమా హీరోలంటే అందరితోనూ చనువుగా తిరుగుతారనే అభిప్రాయం జనాలకు ఉండి ఉండవచ్చు కదా! నువ్వు చూడడానికి చాలా అట్రాక్టివ్ గా అందంగా ఉంటావు. డబ్బు, చదువు, టాలెంట్ అన్నీ ఉన్నాయి. నీలో ఎంచడానికి ఏ లోపమూ లేదు. అలాంటప్పుడు నీ పట్ల అందరూ అట్రాక్ట్ కావడంలో వారి తప్పేముంది? అట్రాక్షన్ అనేది మనసుకు నాచురల్ గా కలిగేది. దానిపై ఎవరికీ కంట్రోల్ ఉండదు. అయినా జరిగిన విషయాలన్నీ మనసులో పెట్టుకుని, ప్రపంచంలో ఉన్న అమ్మాయిలు అందరూ ఒకటేనని డిసైడ్ చేసుకుని, పెళ్లి పెటాకులు లేకుండా ఎన్నాళ్లు ఉంటావు? అసలు ఎవరితోనైనా మాట్లాడితే కదా వాళ్ళు ఎలాంటి వాళ్ళో తెలిసేది. నీ పర్సనల్ స్పేస్ లోకి ఎవరినీ రానివ్వనే లేదు. నీకు ఎదురైన కొన్ని ఇన్సిడెంట్స్ ఆధారంగా నీ చుట్టూ నువ్వే ఒక లైన్ గీసేసుకున్నావు. దాని నుండి బయటకు రావాలి అభీ! నిన్ను ఎవరూ

జైల్లో పెట్టి బంధించలేదు. నువ్వే నీ చుట్టూ ఒక గోడ కట్టుకున్నావు. నువ్వు ఫస్ట్ అందులో నుండి బయటికి రావాలి. నా బతుకు ఇంతే అని డిప్రెస్ అయిపోయి కూర్చుంటే ఎలా! నీ వయసు జస్ట్ పాతికేళ్ళు ఉంటాయి. నీ జీవితం ఇక్కడితో అయిపోలేదు. ఇంకా నువ్వు అనుకున్నవి సాధించడానికి, నీకు నచ్చిన దారిలో నడవడానికి కావలసినంత జీవితం ముందుంది." ఆపకుండా మాట్లాడింది మధుర అభిరామ్ కళ్ళలోనికి సూటిగా చూస్తూ.

"నువ్వు చెప్పేది నాకు అర్థం అవుతోంది మధురా! నేను నీతో ఎగ్రీ అవుతాను కూడా. కానీ నా జీవితంలో ఏదీ నా ప్రమేయంతో, నా ఇష్టంతో జరగలేదు. కనుక నా ఆలోచనలు ఇలా ఫిక్స్ అయిపోయాయి. అసలు నా మొదటి సినిమా అవకాశం ఎలా వచ్చిందో తెలుసా? దాని ప్రొడ్యూసర్ నాన్న బిజినెస్ లో పార్ట్నర్. అనుకోకుండా అతని కూతుర్ని హీరోయిన్ గా పెట్టి సినిమా తీయాలనుకోవడంతో నా గురించి నాన్న దగ్గర అడగడం, నాన్న అతనికి అభయమిచ్చేయడం నా ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి. ఎంబీఏ అయిపోయి వెనక్కి వచ్చాక ఖాళీగానే ఉన్నాను కదా అని నాన్న "సరదాగా ట్రై చెయ్యి" అంటూ ఈ సినిమా ఫీల్డ్ లోకి తోశారు. నాకు కాస్త చేంజ్ గా ఉంటుందని, నేను నలుగురితో కలుస్తానని అనుకుని ఆయన అలా చేసి ఉండవచ్చు. నాన్న మాట కాదనలేక మొదటి సినిమా చేశాను. ఆ తర్వాత మరిన్ని అవకాశాలు రావడం మొదలయ్యాయి. నెమ్మదిగా ఏదో ఊబిలో కూరుకుపోతున్న ఫీలింగ్ వస్తోంది. నిజం చెప్పాలంటే నాకు ఊపిరాడటం లేదు." అన్నాడు అభిరామ్ కాస్త గద్గదమైన స్వరంతో.

"నాకు అర్థమైనంత వరకు నువ్వు నీ ప్రాబ్లమ్స్ అన్నిటినీ ఒక కట్టగా కట్టి చూస్తున్నావు అభీ! దేనికది విడిగా చూడు. అప్పుడు వాటిని సాల్వ్ చేయడం నీకు ఈజీ అవుతుంది. మీ నాన్నగారు ఏమీ చండశాసనుడు కారు. ఇద్దరి మధ్య ఉన్నది పూర్తిగా కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమే. అది సెట్ చేయడానికి పూర్తి అవకాశం ఉంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆయనను బాధ పెట్టడం ఇష్టం లేక కొన్ని విషయాలు నువ్వు ఆయనతో పంచుకోనే లేదు. తిరిగి ఆయన నిన్ను అర్థం చేసుకోలేదని అనుకుంటున్నావు. అసలు నువ్వు చెప్పనిదే ఆయనకి నీ మనసులో ఏముందో ఎలా తెలుస్తుంది? నిన్ను ఎలా అర్థం చేసుకోగలుగుతారు? అసలు నీకు నచ్చింది చేయలేకపోయాను అనే బాధతో నువ్వు ప్రస్తుతం చేస్తున్న దానిని, ఉన్న సినిమా ఫీల్డ్ ని ఎంజాయ్ చేయలేకపోతున్నావు. నిజానికి నీకు అసలు యాక్టింగ్ రాకపోయి ఉండి ఉంటే నువ్వు ఇన్ని సినిమాలలో నిలదొక్కుకోనేలేవు. నేను నీ సినిమాలన్నీ చూశాను. నువ్వు చాలా చక్కగా నటిస్తావు. ఎక్కడా 'అతి' ఉండదు. చాలా నాచురల్ గా ఉంటుందని నీ యాక్టింగ్. అది నీకు పుట్టుకతో వచ్చింది బై గాడ్స్ గ్రేస్. మనిషికి ఏది లేదో అదే కావాలని ఉంటుంది. దాని వల్ల ఉన్నదాని వ్యాల్యూ ఏంటో అర్థం చేసుకోలేదు. నీకు ఇష్టమైన ఫోటోగ్రఫీ దారిలోకి వెళ్లి ఉన్నా కూడా నువ్వు అక్కడ పూర్తిగా సక్సెస్ సాధించగలిగేవాడివని ఖచ్చితంగా చెప్పగలవా? నీకు ముందు నుండి మనసులో ఒక ఖాళీ ఏర్పడిపోయింది. ప్రతి విషయంలోనూ నీ నిరాశకు డిస్సాటిస్ఫాక్షన్ కు అదే ముఖ్యమైన రీసన్. నువ్వు చేస్తున్న పని కాదు." స్పష్టంగా అభిరామ్ కు అర్థమైయే మాటల్లో చెప్పడానికి ప్రయత్నించింది మధుర.

కాసేపు ఏదో ఆలోచిస్తున్నట్లుగా మౌనంగా ఉండిపోయాడు అభిరామ్.

నెమ్మదిగా నిట్టూర్చి "సరే మధురా! నువ్వు చెప్పిన పద్ధతిలో ఆలోచించడానికి ట్రై చేస్తాను. ఏదైనా నువ్వు నా పక్కన ఉన్నావనే ధైర్యం నాకు జీవితంపై కొత్త ఆశని కలిగిస్తోంది. నువ్వు నాకు ముందుగా పరిచయమై ఉంటే ఎంత బాగుండేదో కదా! ఇంతకూ నువ్వు నిజంగానే నా సినిమాలన్నీ చూశావా? నీకు నా యాక్టింగ్ నిజంగానే నచ్చిందా?" కుతూహలంగా అడిగాడు చిన్నగా నవ్వుతూ.

ఆమె నవ్వి "నిజం చెప్పాలంటే నీ యాక్టింగ్ చక్కగా ఉంటుంది. నాకైతే చాలా నచ్చుతుంది. అయితే కాస్త హీరోయిన్లతో రొమాంటిక్ సీన్స్ లో నువ్వు ఎందుకు బిగుసుకుపోతూ ఉంటావో ఇప్పుడు అర్థమైంది." అంది గట్టిగా నవ్వుతూ.

"అమ్మో! నువ్వు మామూలుదానివి కాదు. నన్ను పూర్తిగా చదివేశావు." అంటూ బిగ్గరగా నవ్వాడు అభిరామ్.

అప్పుడు ఉన్నట్లుండి ఇద్దరూ టైం చూసుకున్నారు. సమయం రాత్రి 2 గంటలు కావస్తోంది.

మధుర ఉలిక్కిపడి లేచి "అయ్యో! చాలా ఆలస్యం అయింది. నువ్వు పడుకో! పగలంతా షూటింగులో అలిసిపోయి ఉన్నావు." అంటూ తన గదికి వెళ్ళబోయింది.

అభిరామ్ ఒక్క నిమిషం ఆమె చేయి పట్టుకుని ఆపాడు.

"మధురా! ఇవాళ నుండి నా జీవితానికి నువ్వే డైరెక్టర్ వి. ఇదిగో నీ చేతిలోనే పెడుతున్నాను. ఇకపై నువ్వు ఏం చెప్తే అది చేస్తాను." అన్నాడు ఆమె కళ్ళలోనికి చూస్తూ.

మధుర నవ్వుతూ తలాడించి "అలాగేలెండి హీరోగారూ! ఇంక పడుకోండి. గుడ్ నైట్!" అని చెప్పి తలుపు వరకు వెళ్ళింది.

వెనుకనుండి "మధురా! నువ్వేమీ అనుకోకపోతే ఒక్కసారి నిన్ను హగ్ చేసుకోవచ్చా?" సూటిగా అడిగాడు అభిరామ్ ఉన్నట్లుండి.

మధుర నిర్ఘాంతపోయింది. కానీ ఆమె మనసు ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. అభిరామ్ కు సమాధానం చెప్పకుండా, మామిడిచెట్టును అల్లుకొనే మాధవిలతవలే వెంటనే అతనిని సమీపించి రెండు చేతులతో అతనిని పెనువేసుకుని, తన తలను అతని గుండెలపై వాల్చింది. అభిరామ్ కూడా ఆమెను గట్టిగా హత్తుకుని కళ్ళు మూసుకున్నాడు. ఆ క్షణం ఇద్దరి మనసులలో ఎటువంటి కామ వికారాలు లేవు. ఆ క్షణం జీవితంలో ఇంకేమీ అక్కర్లేదు అనిపించింది అభిరామ్ కు. మరుక్షణం తాను చనిపోయినా ఫరవాలేదు అనిపించింది మధురకు.

వేదన

సౌదామిని చేతికున్న ఉంగరం చూస్తూనే గుణ నిశ్చేష్టుడై అక్కడే గుడి అరుగుపై కుప్పకూలిపోయాడు. సౌదామిని అతనిని గమనించలేదు. సౌదామిని వెళ్లిపోగానే నెమ్మదిగా భక్తులందరూ కూడా ఇళ్లకు వెళ్లిపోయారు. ఊరిలో రక్షకభటులు మరియు కొందరు యువకులు కలిసి గుడిలో దుండగుల శవాలను ఊరవతలకు తీసుకెళ్లి తగలబెట్టారు. గుడినంతా శుభ్రం చేశారు. మరునాడు తెల్లవారుజామున యధావిధిగా ఊరి పెద్దలు, పూజారి కలిసి గుడిలో శుద్ధి కార్యక్రమం మరియు శాంతి హోమం నిర్వహించారు.

ఆ రాత్రి గుణ అంబాపురంలోనే పెళ్లివారి విడిదిలో గడిపాడు. ఆ పూట అతనికి అన్నం సహించలేదు. నిద్ర పట్టలేదు. ఎక్కడలేని దుఃఖం ముంచుకువస్తోంది. చిన్ననాటి నుండి తన ప్రాణంలో ప్రాణంగా చూసుకున్న మాలతి తనతో అబద్దాలు చెప్తోందా! ఇంతగా ప్రేమించిన తనను ఇన్నేళ్లుగా ఏమారుస్తోందా? అతి సున్నితమైన మనస్తత్వం గల సగటు పల్లె పడుచు అయన మాలతి సౌదామిని వంటి వీరవనితగా ఎలా కాగలదు? ఇదేమి మాయ? ఆమె ఎవరి ఆజ్ఞ మేరకు పని చేస్తోంది? హోరాహోరీ జరిగిన ఆ పోరాటంలో నిజంగానే ఆమె ప్రాణానికి ఏదైనా ప్రమాదం వాటిల్లి ఉంటే ఏం జరిగేది? మాలతి లేని జీవితాన్ని కనీసం తాను ఊహించుకోలేడు. ఆలోచనలతో తల బద్దలైపోతోంది గుణకు.

🦋🦋🦋

మర్నాడు గుణ ఇంటికి చేరేసరికి సాయంత్రమయింది. వెళుతూనే తిన్నగా మాలతి ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో ఆమె లేదు. వీరబాహుడు ఒంటరిగా కూర్చుని ఏదో పాత పెట్టెలో సామాన్లు సర్దుతున్నాడు.

ఉన్నట్లుండి ఇంట్లోకి వచ్చిన గుణను చూసి "రా! గుణా! కూర్చో! అంబాపురం పెళ్ళికి వెళ్ళావని మీ అమ్మ చెప్పింది. ఇప్పుడేనా రావడం?" అంటూ ప్రశ్నించాడు.

"అవును మామా! మాలతి ఏది? నిన్నంతా ఎక్కడికెళ్ళింది? ఇంటికి ఎప్పుడు వచ్చింది? ఇప్పుడు ఎక్కడ ఉంది?" వరుసగా ప్రశ్నలను కురిపించాడు.

"ఏమైంది గుణా నీకు! అలా ప్రశ్నిస్తున్నావు? మాలతి ఎక్కడికి పోతుందీ! నిన్నంతా ఎటూ వెళ్ళలేదు. ఒంట్లో కాస్త నలతగా ఉందని ఇంట్లోనే పడుకుంది. ఇందాకే అలా కాళికాలయం వైపు వెళ్లి వస్తానని చెప్పి వెళ్ళింది." అని చెప్పాడు వీరబాహుడు.

వెంటనే తన ఇంట్లోకి వెళ్లి ఊరి నుంచి తెచ్చిన సంచి అక్కడ పడేసి, పిలుస్తున్న తల్లికి సమాధానం కూడా చెప్పకుండా తిన్నగా కాళికాలయం వైపుకు పరుగుతీశాడు గుణ. దారిలోనే దూరంగా మాలతి, భద్ర మాట్లాడుతూ నడుచుకుంటూ ఎదురుగా వస్తూ కనిపించారు. గుణను చూసి వారు దగ్గరకు వచ్చి పలకరించారు. కానీ గుణ ముఖంలో అలసట, ఆత్రుత, బాధ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మాలతి వెంటనే "ఏమైంది గుణా! ఒంట్లో బాలేదా? ఎప్పుడొచ్చావు ఊరు నుండి?" అని అడిగింది.

ముందుగా గుణ ఆమె చేతి వంక చూశాడు. ఉంగరం యథాస్థానంలో మెరుస్తూ ఉంది.

"ఇప్పుడే వచ్చాను. ముందు నేను అడిగిన దానికి సమాధానం చెప్పు. నిన్న రోజంతా ఎక్కడ ఉన్నావు?" అని అడిగాడు సూటిగా.

"నేనెక్కడ ఉంటానూ? మా ఇంట్లో ఉన్నాను." అంది మాలతి తడుముకోకుండా.

భద్రకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. గుణను అటువంటి మానసిక స్థితిలో అతడు ముందెన్నడూ చూడలేదు. అతని చేయి పట్టుకొని లాగి కాస్త పక్కకు తీసుకెళ్లాడు.

"ఏమైందిరా నీకు? ఈ వాలకం ఏమిటి? ఏమిటా అర్థం లేని ప్రశ్నలు?" అంటూ నిలదీశాడు.

భద్ర అడుగుతున్న విషయాన్ని పట్టించుకోకుండా "నీకు మాలతి ఎక్కడ కనిపించింది? ఆమె ఎక్కడినుండి వస్తోంది?" మళ్ళీ అడిగాడు గుణ.

"మళ్లీ అదే మాట మాట్లాడుతున్నావ్! మాలతి ఎక్కడికి పోతుందిరా? కాళికాలయానికి వెళ్ళింది. నేను కూడా అనుకోకుండా ఇవాళ అక్కడకి వెళ్లినప్పుడు కలిసాము. కనుక వెనక్కి కబుర్లు చెప్పుకుంటూ తిరిగి వస్తున్నాము. దారిలో నువ్వు వచ్చి ఆపావు." అన్నాడు భద్ర అసహనంగా.

"మీ స్నేహితుల ఇద్దరి పరాచకాలు అయ్యాయా? నేను వెళ్తున్నాను. నాన్న ఎదురుచూస్తూ ఉంటాడు. నాకు ఆలస్యం అవుతోంది. భద్రన్నా! మా గుణను భద్రంగా ఇంటికి చేర్చు!" మాలతి నవ్వుతూ చెప్పి వెళ్ళిపోయింది.

అక్కడే దారి పక్కన గడ్డిలో చతికిలబడిపోయాడు గుణ. భద్ర కూడా పక్కనే కూర్చున్నాడు.

"ఇప్పటికైనా ఏమైందో చెప్తావా?" నెమ్మదిగా అడిగాడు భద్ర. గుణకు ఏమి చేయాలో పాలుపోక దిక్కులు చూస్తున్నాడు.

"నీకు ప్రస్తుతం నేను ఏమీ చెప్పలేను. అసలు ఏం జరుగుతోందో నాకే పూర్తిగా అర్థం కావటం లేదు." అన్నాడు గుణ దిగులుగా.

"నిన్ను నేను ఎప్పుడూ ఇలాంటి స్థితిలో చూడలేదు. నువ్వేదో నాకు తెలియకుండా దాస్తున్నావు. నాకు ఏం జరిగిందో పూర్తిగా చెప్తే తప్ప ఇక్కడి నుండి కదలను." అన్నాడు భద్ర.

గుణకు ఏం చెప్పాలో తెలియలేదు. అంబాపురం గుడిలో జరిగినదంతా మొత్తం భద్రకు పూసగుచ్చినట్లు చెప్పాడు. చివరిలో తాను సౌదామిని చేతికి ఉంగరం చూసిన విషయం మాత్రం చెప్పలేదు. అది తాను చెప్పినా, భద్ర మాత్రమే కాదు.. ఎవరూ నమ్మరు. భద్ర నోరు వెళ్ళబెట్టి గుణ చెప్పేదంతా విన్నాడు.

"లేచిన వేళావిశేషం బాగుండి నీకేమీ కాలేదు. ఆ సౌదామిని దయవల్ల అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. అంతే చాలు." అంటూ భద్ర గాలిలోనే దేవుడికి దణ్ణం పెట్టాడు.

"నీకు సౌదామిని గురించి ఏమన్నా వివరాలు తెలుసా? నీవు ఆమెను ఎప్పుడైనా గతంలో చూసావా?" అని అడిగాడు గుణ వెంటనే.

"నాకు ఆమె గురించి పెద్దగా తెలియదు కానీ ఒకసారి చూడడమైతే చూశాను." అని చెప్పాడు భద్ర.

"ఎక్కడ చూసావు? ఎప్పుడు చూసావు?" అంటూ ఆత్రుతగా అడిగాడు గుణ.

భద్ర ఒక క్షణం ఆలోచించి గుర్తుతెచ్చుకుంటూ "ఒక నెల రోజులు అవుతుంది అనుకుంటాను. ఒక రోజు నేను ధర్మగిరి అశ్వశాలను చూడడానికి వెళ్లాను. ఆ రోజు నేను తిరిగి వస్తూ ఉండగా ఊరి పొలిమేరలో రైతులందరూ గుమి గుడి ఉండడం చూసి ఆగాను. వారి మధ్యలో మూసుగుతో ఉన్న ఒక యువతి ఏదో మాట్లాడుతూ ఉంది. ఆమె పక్కనే ఒక గోధుమ రంగులో ఒక మంచి గుర్రం కూడా ఉంది. అప్పుడు ఆమెను అందరూ సౌదామిని అని సంబోధిస్తూ మాట్లాడడం విన్నాను. ఆమె మాటలు కూడా విన్నాను. రైతులకు కప్పం కట్టడం విషయంలో ధైర్యం చెప్తోంది. పంట కోసేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు వహించాలో చెప్పింది. ఎటువంటి సమస్య వచ్చినా ధైర్యం కోల్పోవద్దని, కలిసి ఐకమత్యంగా పోరాడమని, తాను వారి వెంట ఉంటానని చెప్పింది. ఆమె కళ్ళల్లో ఏదో తెలియని తేజస్సు, ఆమె మాటలో ఏదో అర్థం కాని మహత్తు గోచరించాయి. ఆమెను చూస్తేనే ఏదో దైవత్వం ఉన్న వ్యక్తి అని అర్థమయ్యి నేను కూడా అందరితో పాటు ఆమెకు చేతులెత్తి దణ్ణం పెట్టాను." తన అనుభవమంతా వర్ణిస్తూ చెప్పాడు భద్ర.

అంతా విని ఒక్క క్షణం ఆలోచించి "ఇది ఏ రోజు జరిగిందో ఎలాగైనా వెంటనే గుర్తుతెచ్చుకొని చెప్పు." అంటూ తొందరపెట్టాడు గుణ.

"ఎందుకింత కంగారు పడుతున్నావు? నాకు అది ఏ రోజో సరిగ్గా గుర్తులేదు. బహుశా ఆ రోజు చవితి అనుకుంటాను." అన్నాడు భద్ర ఆలోచిస్తూ.

"సుమారు నెలరోజుల క్రితం చవితి అంటే.. మాలతి పుట్టినరోజుకు ముందు రోజు అవ్వాలి. కానీ ఆరోజు సాయంత్రం నువ్వు నాతో మాట్లాడడానికి వచ్చావు కదా! ఆ రోజు సంతకు వెళ్లానని కూడా చెప్పావు. గుర్తుందా?" ఆదుర్దాగా అడిగాడు గుణ.

"అవును. సరిగ్గా గుర్తు చేశావు. ఆ రోజు సంతకు వెళ్ళిన మర్నాడే నేను ధర్మగిరి వెళ్లాను. అంటే అది చవితి కాదు. ఖచ్చితంగా పంచమి అవ్వాలి." అన్నాడు స్పష్టంగా.

గుణ తల గిర్రున తిరిగింది ఆ సమాధానం వినగానే. పంచమి అంటే మాలతి పుట్టినరోజు. ఆనాడు రోజంతా ఆమె తన కళ్ళ ఎదురుకుండానే ఉంది. ఇద్దరూ కలిసే ఇంద్రేశ్వర ఆలయానికి వెళ్లారు. పైగా అంబాపురంలో తాను చూసిన గుర్రం తెల్లనిది. ధర్మగిరిలో భద్ర చూసిన గుర్రం గోధుమ రంగుది. మాలతికి సౌదామినికి ఏ సంబంధమూ లేకపోతే మాలతి ఉంగరం సౌదామిని చేతికి ఎలా వెళ్ళింది? అది ఖచ్చితంగా తాను చేసిన ఉంగరమే! అటువంటిదే మరొక

ఉంగరం కావడానికి ఎటువంటి ఆస్కారమూ లేదు. ఆలోచించిన కొద్దీ బుర్ర పగిలిపోతుంది గుణకు. చిక్కుముడి బిగుసుకుంటోంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS